క్లుప్తంగా

ఈ-కేవైసీ తప్పక చేయించుకోవాలి

కొలిమిగుండ్ల: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ జ్యోతి ఆదివారం తెలిపారు. 2023 ఖరీఫ్‌కు సంబంధించి మూడు వేల మంది రైతులు పంట నమోదు చేసుకున్నారని చెప్పారు. అయితే 2,060 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారని, మిగిలిన 940 మంది రైతులు ఈనెల 10 వ తేదీలోపు భరోసా కేంద్రాల్లో చేయించుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ పూర్తి చేయించుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పంటల బీమా, మద్దతు ధర, పంట నష్టపరిహారం తదితర పథకాలు వర్తించవని ఆమె చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని మండ్లవానిపల్లె గ్రామ సమీపాన పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ ఆదివారం తెలిపారు. వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన 10 మంది పేకాటఆడుతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు.రూ.30వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్యాపిలి: తమతో పాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు ఆదినారాయణ ఈ ఏడాది మే 14 వ తేదీ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ప్యాపిలి పూర్వ విద్యార్థుల సంఘం (పోసా) ఆధ్వర్యంలో మిత్రులు లక్ష రూపాయలు పోగు చేసుకున్నారు. ఈ మొత్తాన్ని బాధితుడి కుమార్తె అపర్ణ పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను ఆదివారం బాధితుడి భార్య సువర్ణకు అందజేశారు. తమ స్నేహితుడి కుమార్తె అపర్ణ చదువులకు కూడా భవిష్యత్తులో అండగా ఉంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, తొప్పెల లక్ష్మన్న, వీర మనోహర్ రెడ్డి, కోసల రాంబాబు, సురేంద్ర, రామానాయుడు, శ్రీధర్ రాజు, గండికోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

డోన్ టౌన్ : బీరు సీసాతో దాడి చేయడంతో కళ్యాణ్ అనే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. పట్టణంలోని తారక రామనగర్‌కు చెందిన కళ్యాణ్ ఆదివారం రాత్రి వెంకటాపురం రోడ్డులో ఉన్న పేరంటాలమ్మ గుడి సమీపంలో ఉండగా ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు తెలిసింది. అయితే కళ్యాణ్‌పై ఎవరు, ఎందుకు దాడి చేశారన్న విషయం తెలియాల్సి ఉంది. గాయపడిన కళ్యాణ్ చికిత్సల నిమ్మిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

గుండె పోటుతో సామాజిక సేవకుడు మృతి


శంకర్ (ఫైల్)

డోన్ టౌన్ : పట్టణ ప్రజలకు సుపరిచితుడు, సామాజిక సేవకుడు, అయ్యప్ప స్వామి మాలదీక్ష పరుడైన కేవీఆర్ శంకర్ స్వామి శెట్టి (56) గుండె పోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పలువురు ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీఆర్ శంకర్ స్వామి శెట్టి సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు.

బేతంచెర్ల క్రీడాకారుడి ప్రతిభ

బేతంచెర్ల: హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా, గచ్చి బౌలి స్టేడియంలో గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 21.1 కిలోమీటర్ల రన్ (పరుగు పందెం) పోటీలలో బేతంచెర్ల పట్టణానికి చెందిన జాతీయ క్రీడాకారుడు సుదర్శన్ రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి మెడల్ కైవసం చేసుకున్నారు. సుమారు 2వేల మందికి సంబంధించి 30-35, 40-45, 50-55 వయసుల విభాగంలో జరిగిన పరుగు పందెం జరిగింది. సుదర్శన్ రెడ్డి 35 సంవత్సరాలోపు విభాగంలో పాల్గొని మెడల్ కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయనను పట్టణ వాసులు, ప్రముఖులు, తోటి క్రీడాకారులు అభినందించారు.

జిల్లా కార్యాలయానికి అవుకు ఎస్‌ఐ

అవుకు: అవుకు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నరేంద్రను జిల్లా కార్యాలయానికి వెళ్లేలా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదివారం ఆదేశాల జారీ చేశార ని స్థానిక పోలీసులు తెలిపారు. ఆయన స్థానంలోకి వీఆర్‌లో ఉన్న మేకల విష్ణు నారాయణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయానికి.. అవుకు తహసీల్దార్

అవుకు: అవుకు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బచ్చు శ్రీనివాసులును జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారని ఆదివారం స్థానిక రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అలాగే ఆయన స్థానంలో బనగానపల్లె తహసీల్దార్ వెంకటేశ్వర్లును నియమిస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులను జారీ చేశారని తెలిపారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

డోన్ టౌన్ : రైల్వే రిటైర్డ్ ఉద్యోగి మలిశెట్టి తిరుపతయ్య తన భార్య దివంగత మలిశెట్టి కుమారి జ్ఞాపకార్థం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత కుటంబ సభ్యులు, బంధువులు వినయ్‌కుమార్, హరీషా, రవికుమార్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగ్గా... 'ఉపాధి'

- రైతు, రైతుకూలీలను ఆదుకుంటున్న ఉపాధి హామీ పథకం
- చెరువుల అభివృద్ధికి తోడ్పాటు
- ఉద్యావన పంటల సాగుకు ఊతం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

బనగానపల్లె : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతు, రైతు కూలీల పాలిట వరంగా మారింది. వ్యవసాయ కూలీల వలసల నివారణే లక్ష్యంగా అమలు చేస్తున్న ఉపాధి పథకం రైతులకూ అండగా నిలుస్తుంది. ఉన్న ఊళ్లోనే రైతులు, రైతులు కూలీలకు మెరుగ్గా ఉపాధి కల్పిస్తుందీ పథకం. వ్యవసాయ కూలీలు ఉపాధి పనులతోపాటు సొంత పనులు చేసుకుంటూ జీవనం సాగించేలా ఈ పథకం చేయూతనిస్తుంది. చెరువు పూడికతీత, కాల్వల అభివృద్ధి, ఇంకుడు గుంతలు తీసుకునేందుకు ఉపాధి పథకం తోడ్పడుతుంది. ఖరీఫ్, రబీ సీజన్‌లో వ్యసాయపనులు ఉన్నప్పటికీ మిగత సమయాల్లో కూలీలు వలసపోకుండా ఉపాధి పనులు నియంత్రిస్తున్నాయి. కూలీలకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం వేతనలు చెల్లిస్తున్నందున ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నారు. జిల్లాలో మొత్తం 2.80,117 జాబ్ కార్డులు ఉండగా యక్టివ్ జాబ్‌కార్డులు 2,14,187 ఉన్నాయి. ఈ ఏడాది పనిదినాల లక్ష్యం 76.42 లక్షలు ఉండగా పనులు కల్పించిన కుటుంబాలు 1.56 లక్షలు ఉన్నాయి. ఇప్పటి వరకు జరిగిన పనిదినాలు 61.89.190 ఉండగా ప్రగతి శాతం 80.98 ఉంది. ప్రభుత్వం నామమాత్ర పనులతో సరిపెట్టుకుండా చెరువులను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు కాల్వలో పూడిక తీత చెరువుగట్లను పటిష్టం చేయడం నీటికాల్వల భద్రత చెరువుగట్ల పై మొక్కల పెంపకం చేపడుతుంది. చెక్‌డ్యాంలు, చెత్త నుంచి సంపద వేరు చేసే కేంద్రాల నిర్మాణ పనులను చేపట్టడంతో ఆయా గ్రామాలకు ఆస్తులు సృష్టింపబడుతున్నాయి. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించి ఆర్థికంగా ఆదుకుంటూ జిల్లా ముందజలో ఉంది.

వందశాతం వేతనాలు చెల్లింపు

ఉపాధి హామీ కూలీలకు వేతన చెల్లింపుల్లో వంద శాతం ప్రగతి సాధించారు. మెటీరియల్, కాంపొనేంట్ కింద మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే కల్పిస్తుంది. వేతనాల కింద శ్రమజీవులకు రూ.149.05 కోట్లు చెల్లింపులు జరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యావనపంటల సాగు 5వేల ఎకరాల టార్గెట్ ఉండగా ఇంత వరకు 3.321 ఎకరాలు సాగు చేశారు. ఈ పంటలను తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అర్హులైన అన్నదాతల నుంచి దరఖాస్తులు స్వీకరించి పండ్లతోటల పెంపకానికి ప్రోత్సహిస్తున్నారు అధికారులు. జిల్లాలో 454 గ్రామ పంచాయతీల్లో కొబ్బరి, మామిడి, సపోట, నిమ్మ, మునగ, చీని, బత్తాయి డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పంటల సాగుకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేయనుంది. జిల్లాలో అమృత్‌సరోవర్ కింద 78 చెరువులు పునరుద్ధరణ పనులు చేపట్టారు.

ప్రగతి వివరాలు	
జిల్లాలో జారీ చేసిన జాబ్‌కార్డులు	2.80.117
యాక్టివ్ జాబ్‌కార్డులు	2.14 187
ఈ ఏడాది పనిదినాల లక్ష్యం	76.42 లక్షలు
పనులు కల్పించిన కుటుంబాలు	1.55.573
ఇప్పటి వరకు జరిగిన పనిదినాలు	61.89లక్షలు
ప్రగతి శాతం	80.98
వేతనాలు చెల్లింపులు	రూ.149.05కోట్లు
ఉద్యానవన పంటల సాగు టార్గెట్	5వేల ఎకరాలు
ఇంత వరకు సాగు చేసినది	3.321ఎకరాలు
పునరుద్ధరించిన చెరువులు	74
నూతనంగా ఏర్పాటు చేసింది	04

వలసలు వెళ్లకుండా ఉపాధి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం వలసల నివారణకు ఎంతో ఉపయోగపడుతుంది. వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి పనులు చేసుకుంటున్నాం. ప్రభు త్వం ఉపాధివే తనాలు పెంచడంతో కనీసం రోజుకు రూ.300లు తక్కువకాకుండా లభిస్తుంది. ఉపాధి పనులు కూలీలకు అండగా నిలుస్తున్నాయి.
– దూదేకుల నజీమా ఉపాధి కూలీ, భానుముక్కల బనగానపల్లె మండలం

ఎంతో ఉపయోగకరంగా ఉంది



గతంలో పనుల కోసం ఎన్నో ఇబ్బందులు పడే వారం. ఉపాధి హామీ పథకం కూలీలను ఆదుకుంటుంది. వలసలు వెళ్లకుండా పనులు కల్పిస్తుండడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంది. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలుతో సొంత గ్రామాల్లోనే పనులు లభిస్తున్నాయి.
– మదర్‌బీ, ఉపాధి కూలీ, నందవరం బనగానపల్లె మండలం

ప్రజల జీవనోపాధికి వరం



ప్రభుత్వం అమలు పరచిన ఉపాధిహామీ పథకం ప్రజల జీవనోపాధికి వరంలా మారింది. వ్యవసాయ పనులు లేని సమయాల్లో ఇతర ప్రాంతాలకు వలసవెళ్లకుండా ఉపాధి పనులు కల్పించి జీవనోపాధి కల్పిస్తున్నాం. జాబ్‌కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. సొంత గ్రామాల్లోనే పనులు కల్పిస్తున్నాం.
– రామచంద్రారెడ్డి, పీడీ డ్వామా నంద్యాల జిల్లా

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్లకు సంబంధించి జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం ,కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల మండలంలో....

సంజామల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్ ఫీడర్ల పరిధిలోని విద్యుత్ సరఫర వేళలను వివరించారు. ఆల్వకొండ, ముక్కమల్ల, వసంతాపురం, ఎగ్గోని, కానాల, అక్కం పల్లె, గిద్దలూరు, లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె ఫీడర్ల పరిధిలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

11న మండల సర్వసభ్య సమావేశం

బనగానపల్లెరూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం భవనంలో ఈ నెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య ఆదివారం తెలిపారు. ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

16న బేతంచెర్ల మండల మండల మీట్

బేతంచెర్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 16వ తేదీన ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సర్వసభ్యసమావేశానికి ఆయా శాఖల అధికారులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలన్నారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీసాయి క్లీనిక్‌లో గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణకు సోమవారం ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నట్లు ఆసుపత్రి కోఆర్డినేటర్ శివ తెలిపారు. కేవీఎస్ కాలనీలోని శ్రీసాయి క్లీనిక్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు కొండమనాయునిపల్లెలో హెల్త్ క్యాంప్

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇద్దరు జనరల్ డాక్టర్లు, ఇద్దరు వైద్య నిపుణులు మెడికల్ క్యాంప్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహానందిలో సండే సందడి

మహానంది: మహానందీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. కొద్దిరోజులుగా రద్దీ తక్కువగా ఉన్నప్పటికీ వీకెండ్ శనివారం , సెలవురోజు ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

ఓంకారంలో భక్తుల సందడి

ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఆలయానికి చేరుకున్న భక్తులు శ్రీ గంగ, ఉమాసమేత ఓంకారసిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు స్థానిక కాశినాయన అన్నప్రసాద వితరణ వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.

దరఖాస్తుల పరిశీలన


ఇంటింటికి వెళ్లి ఓటర్ల పేర్లను పరిశీలిస్తున్న సూపర్ వైజర్లు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలో ఆదివారం ఫారం-7లో ఓటర్ల తొలగింపు, డబుల్ ఎంట్రీ తదితర వివరాలకు సంబంధించి బీఎల్‌ఓలు(బూత్ లెవల్ ఆఫీసర్స్) డోర్ టు డోర్ రీ-వేరిఫికేషన్ చేశారు. ఫారం-7 ద్వారా స్థానిక ఎన్నికల సిబ్బంది అర్హత కలిగిన ఓటర్ల పేర్లను తొలగించే చర్యలు తీసుకున్నట్లు వివిధ పొలిటికల్ పార్టీల నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఫారం-7లో బీఎల్‌ఓలు తొలగించిన ఓటర్ల వివరాలను ఇంటింటికి వెళ్లి సంబంధిత ఓటర్ ఉన్నారా, చనిపోయారా తదితర వివరాలను పునఃపరిశీలిస్తునట్లు మండల ఆర్‌ఐ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. అన్ని వివరాలు సేకరించి అర్హత ఉంటే మళ్లీ ఓటర్ లిస్ట్‌లో నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలో 31 పోలింగ్ బూత్‌లకు సంబంధించి 31 మంది బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రసాద్, పుల్లయ్య, ఈశ్వర్‌రెడ్డి, బీఎల్‌ఓలు శాంతకుమారి, లక్ష్మీదేవి, మహేశ్వరప్రసాద్, సురేంద్రబాబు,మనోహర్ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


పొలాల రహదారి ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: ప్రజాసంక్షేమంతోపాటు గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ అన్నారు. మండల పరిధిలోని రహిమానుపురం గ్రామంలో పొలాలకు వెళ్లే రహదారి నిర్మాణానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ప్రతి సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని, రైతుల సౌకర్యార్థం పొలాలకు కూడా రహదారులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, గూని నాగరాజు, మధు, రామిరెడ్డి పాల్గొన్నారు.

అన్నిమతాల సారాంశం ఒక్కటే


మాట్లాడుతున్న మౌలానా అబ్దుల్‌ఖదీర్ ఉమరి

బనగానపల్లెరూరల్ : హిందూ, ముస్లిం క్రైస్తవ తదితర అన్ని మతాల్లోని సారాంశం ఒక్కటే అని అనంతపురం జిల్లా కదిరి మండలం జమా అతె ఇస్లామి హింద్ శాఖ సహాయకార్యదర్శి మౌలానా అబ్దుల్‌ఖదీర్ ఉమరి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జెమా అతె ఇస్లామి హింద్ కార్యాలయంలో అధ్యక్షుడు ఎంఎం అలిబేగ్ ఆధ్వర్యంలో మహమ్మద్‌ప్రవక్త జీవిత చరిత్రపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాల్లోని దేవుడు తమ ఇరుగు పొరుగు వారి పట్ల ప్రేమగా ఉండాలని, ఆర్థికంగా ఉన్న వారు పేదలకు తమవంతు సహకారం ఇచ్చి ఆదుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఏవరైతే తాను, తన కుటుంబ, కులం అని భావిస్తారో అలాంటి వ్యక్తులను ఏ దేవుడు క్షేమించరన్నారు. కార్యక్రమంలో అచలపీఠం గురువు డాక్టర్ సత్యనారాయణ, పట్టణానికి చెందిన పలువురు ముస్లిం, హిందూ సోదరులు పాల్గొన్నారు.

శర వేగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు


బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామ సమీపాన బేతంచెర్ల- బనగానపల్లె ప్రధాన రహదారిలో సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన పురాతన బ్రిడ్జి దెబ్బతినడంతో పునర్నిర్మాణానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో సుమారు రూ. 70 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత కంట్రాక్టర్ పనులు ప్రారంభిచడంతో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి ఆదివారం పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కంట్రాక్టర్ కు సూచించారు. ప్రస్తుతం 7మీటర్ల ఉన్న బ్రిడ్జిని వాహనాల రాకపోకల రద్దీకి అనుగుణంగా 12 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

మొదలైన రబీ సాగు!

బేతంచెర్ల : మండలంలో నల్ల రేగడి భూముల్లో రబీ సాగు మొదలైంది. ఆర్ఎస్‌రంగాపురం, బుగ్గానిపల్లె, బేతంచెర్ల, హెచ్ కొట్టాల, బలపాలపల్లె, యంబాయి గ్రామాల్లోని నల్ల రేగడి భూముల్లో శనగ, జొన్న, విత్తనాలు విత్తుతున్నారు. ఈనెల ప్రారంభం నుంచి ఆర్‌బీకేల్లో విత్తనాల రిజిస్ట్రేషన్ నమోదు చేసి సబ్సిడీపై అధికారులు శనగ విత్త నాలను రైతులకు అందజేస్తున్నారు. దీంతో ముద్దవరం, ముసలాయిచెర్వు, ఎం, పెండెకల్లు, గూటుపల్లె, తవిసికొండ, కొలుములపల్లె గ్రామాల్లోని ఎర్రనేలల్లో ఖరీఫ్‌లో సాగు చేసిన కొర్ర, సజ్జ పంటలను తొలగించి పెసలు, జొన్న, మినుములు, ఉలవలు విత్తనాలు విత్తే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు.


బుగ్గానిపల్లెలో విత్తనం వేస్తున్న దృశ్యం

వేగంగా సీసీ రోడ్డు నిర్మాణం


సంజామల ఎస్‌టీ కాలనీలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

సంజామల: మండల కేంద్రం సంజామల గ్రామ పంచాయితీలో 20 లక్షల తో వివిధ కాలనీలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఎస్‌సీ, ఎస్‌టీ, పీర్లచావిడి కాలనీ, తాళపేటలో చేపట్టిన రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని గుండం సూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు.

అభివృద్ధిలో అగ్రగామిగా డోన్ నియోజకవర్గం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: డోన్ నియోజకవర్గాన్ని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఏపీ ఐబీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో దాదాపు రూ.3 వేల కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 18 కేంద్రీయ విద్యాలయాలు మంజూరైతే వాటిలో డోన్ కూడా ఉండటం మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవకు అద్దం పడుతుందన్నారు. డోన్ పట్టణంలో వంద పడకల ఆసుపత్రి, ప్యాపిలిలో నాలుగు లైన్ల రహదారి విస్తరణ, హుసేనాపురంలో పాలిటెక్నిక్ వెటర్నరి కళాశాల, గొర్రెల పెంపకందారుల శిక్షణకేంద్రం తదితర అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలిచిపోనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 68 చెరువులకు నీరు నింపే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేసి రైతుల సాగునీటి కష్టాలను మంత్రి అనతి కాలంలోనే తీర్చుతారన్నారు. రూ. 300 కోట్లతో గోరకల్లు నుంచి ఇంటింటికీ తాగునీరు అందించే పనులు కూడా శరవేగంగా సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగం చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, బోరెడ్డి కృష్ణారెడ్డి, రాజా మురళీకృష్ణ, మద్దయ్య, చంద్రశేఖర్ రెడ్డి, గండికోట రామాంజనేయులు, కొండయ్య, బోరెడ్డి రఘు, ప్రవీణ్, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గాజుల నరసింహులు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పాలెగార్లు, రాజవంశీకులకు అండగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణరాజు

అవుకు: ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న రాజవంశీకులు, పాలెగాళ్లు, జాగీదార్ల వారసులకు ప్రభుత్వం అండగా నిలవాలని రాష్ట్ర పాలెగార్ల వారసుల సంఘం అధ్యక్షుడు ఎనుగొండ కేశవులు నాయుడు, అవుకు రాజ వంశీకుడు నంద్యాల రామక్రిష్ణరాజు కోరారు. మండల కేంద్రం అవుకు కోటలోని నంద్యాల రామకృష్ణరాజు స్వగృహంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారసులు ఆదివారం సమావేశమయ్యారు. అలనాటి పరిస్థితుల.. ప్రస్తుత స్థితిగతులపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో థామస్ మన్రో... రాజవంశీకుల, పాలెగార్ల, జాగీదార్లకు కల్పించిన వారసత్వ హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అప్పట్లో తమకు పెన్షన్ వస్తూండేదని, అయితే గత ప్రభుత్వాలు కొంతమందికి నామమాత్రంగా అందించి, మరికొందరివి రద్దు చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందించి పెన్షన్‌ను అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాజవంశీకులు, పాలెగార్లు నిర్మించిన దేవాలయాలు, చెరువులకు వారి పేర్లు పెట్టాలని, శిధిలావస్థలో ఉన్న కోటలను, బురుజులను ప్రభుత్వం వారసత్వ కట్టడాలుగా ప్రకటించి సంరక్షించాలని కోరారు. అవుకు చెరువును అప్పటి రాజవంశీకులు తిమ్మరాజు నిర్మించారని, ప్రస్తుతం ఆ చెరువు రిజర్వాయర్‌గా రూపొందిందని, దీనికి ఆయన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో చారిత్రక రచయిత తవ్వా ఓబులరెడ్డి, కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాలోని పాలెగార్ల వారసులు విజయవర్మ, మట్టి శ్రీధర్ వర్మ, బోడా శింగరప్ప నాయుడు, బలరామయ్య, మంగమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో చురుగ్గా అభివృద్ధి పనులు


నిర్మాణంలో ఉన్న గృహాలు

కొలిమిగుండ్ల: కస్తూర్బా పాఠశాలకు ఎదురుగా జాతీయ రహదారి చెంతనే ఇటిక్యాల రెవిన్యూ పరిధిలోని జగనన్న కాలనీలో మౌలిక వసతులు పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొలిమిగుండ్ల కాలనీకి పక్కనే చింతలాయిపల్లె గ్రామ పంచాయితీ నుంచి 230 మంది లబ్ధిదారులకు ఇక్కడ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. అనివార్య కారణాల మూలంగా మొదట్లో కాలనీలో రోడ్డు, విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా ఏర్పాటులో జాప్యం జరిగింది. ఇళ్ల నిర్మాణాలు చేసుకునేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక పోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. సమస్యను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో చర్చించి కాలనీలో డీఎంఎఫ్ నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. నీటి సౌకర్యార్థం బోరు ఏర్పాటు చేశారు. కాలనీలో గ్రావెల్ రోడ్డు చేపట్టడంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నారు. విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించనుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కాలనీలో ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డు


విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన దృశ్యం